సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



నాలుగు నెలలుగా ఎదురుచూపులు

నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడం తో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 8లో



ప్రభుత్వాస్పత్రిలో సేవలందించాలి

భద్రాచలం ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్నం దున ప్రైవేట్ వైద్యులు సేవలందించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
35° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. అనంతరం మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు నాగరాజు, గంధం వెంగళరావు, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, వేద పడింతులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

జెడ్పీ కార్యాలయానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్, సీఈఓ తదితరులు

చుంచుపల్లి: జెడ్పీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, సీఈఓ ఎస్.ప్రసూనారాణి గురువారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లోని స్థలాన్ని పరిశీలించారు. గతంలో కార్యాలయ భవన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవించగా, ఆ ప్రతిపాదనలకు సంబంధించిన ఎస్టిమేట్లు పంపించాలని సీఎంఓ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. దీంతో పీఆర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ శివలాల్ పాల్గొన్నారు.

పాఠశాలలకు నేడు సెలవు

కొత్తగూడెంఅర్బన్ : మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా శుక్రవారం జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కుంభమేళా మేడారం జాతరలో నేడు ముఖ్య ఘట్టమైనందున జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు కుటుంబసమేతంగా వెళ్లనుండడంతో స్థానిక శాసనసభ్యులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ సెలవుకు బదులు మార్చిలో రెండో శనివారం పాఠశాలలు పని చేస్తాయని తెలిపారు.

యువత వృత్తి విద్యా కోర్సులపై దృష్టి సారించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న జీఎం రాజేశ్వరరావు

పాల్వంచ: నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేస్తూనే వృత్తివిద్యా కోర్సులపై దృష్టి సారించాలని నవ లిమిటెడ్ జనరల్ మేనేజర్ వీ.వీ.రాజేశ్వరరావు సూచించారు. పాల్వంచలోని నవ ఒకేషనల్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎలక్ట్రికల్, ఆర్‌అండ్‌ఏ, డీటీపీ, టాలీ శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఆయన గురువారం సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. గతంలో ఇక్కడ శిక్షణ పూర్తిచేసిన యువత నెలకు రూ.15వేలకు పైగా సంపాదిస్తున్నారని తెలిపారు. కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శంకరయ్య, డీఎస్‌డీ నాగేశ్వరరావు, చీఫ్ మేనేజర్ కృష్ణ, సీహెచ్.శ్రీనివాస్, రామకృష్ణ, శర్మ పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటుకు ఉత్తర్వులు

దమ్మపేట: దమ్మపేటలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇల్లెందులో ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టును దమ్మపేటకు బదిలీ చేశారు. దమ్మపేటలో మార్చి మొదటి వారంలో కోర్టు ప్రారంభించనున్నట్టు సమాచారం.

కారుణ్యంపై నజరేది?

సింగరేణిలో పెరుగుతున్న దళారుల దందా

- వారసత్వ ఉద్యోగాలంటే కార్మిక కుటుంబాలకు మక్కువ
- సెంటిమెంట్‌ను ఆసరా చేసుకుని అక్రమార్జన
- వారసుల నియామకాల్లో అవినీతి ఆరోపణలు
- నిజానిజాలు తేల్చేలా విచారణకు డిమాండ్



సింగరేణి ప్రధాన కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నో చిక్కుముడులను, మరెన్నో సవాళ్లను దాటుకుంటూ గత ప్రభుత్వం ఉదాత్త ఆశయంతో అమల్లోకి తెచ్చిన కారుణ్య నియామకాలు దళారుల సిండికేట్‌కు కాసులు కురిపించేవిగా మారాయి. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల నుంచి కనికరం లేకుండా లక్షల రూపాయలు కాజేస్తున్న దళారులపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించాలని సింగరేణి కార్మికులు కోరుతున్నారు.

కార్మికుల కష్టార్జితం పక్కదారి..

గతంలో సింగరేణి ప్రాంతంలో ఉండే నిరక్షరాస్యతకు తోడు సంస్థలో రెండు ఇంటి పేర్లతో పని చేసేవారు ఉండటం, స్థానికత తదితర అంశాల కారణంగా కారుణ్య నియామకాల్లో తమ వారసులకు ఉద్యోగం సాధించడం కష్టంగా మారేది. ఈ సమస్యల పరిష్కారం కోసం కార్మిక సంఘాల నాయకులు సాయం చేసేవారు. అయితే కాలక్రమంలో కార్మిక సంఘాల పేరు చెప్పుకుని కార్మికుల నుంచి డబ్బులు లాగే దళారులు ఎక్కువయ్యారు. వీరి ఆగడాలను అరికట్టడంలో ఆరంభంలో ఉదాసీనంగా వ్యవహరించడంతో ఇప్పుడీ వ్యవస్థ బలంగా వేళ్లూనుకుని పోయింది. దళారులను ఆశ్రయించకుండా కారుణ్య నియామకాలకు వెళితే పని జరగదనే పరిస్థితి నెలకొంది. దీంతో ఓ వైపు కార్మిక సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసే సంఘాలకు చెడు పేరు వస్తుండగా, మరోవైపు కార్మికుల కష్టార్జితం పక్కదారి పడుతోంది.

ఎనభై శాతానికి పైగా..

కారుణ్య నియామకాల ప్రక్రియ పునరుద్ధరణ తర్వాత సింగరేణి రిక్రూట్‌మెంట్‌లో 80 శాతం ఈ పద్ధతిలోనే జరుగుతున్నాయి. మెడికల్ అన్ ఫిట్ అయిన కార్మికుడి స్థానంలో అతడి వారసులు ఉద్యోగాలకు వస్తున్నారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత సంస్థాపరమైన పరీక్షలు రాస్తూ ఉన్నత స్థానాలకు చేరుతున్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు సింగరేణిలో 12 వేల మందికి పైగా కొత్త ఉద్యోగులు చేరితే అందులో దాదాపు 10 వేల మంది కారుణ్య నియామకాల ద్వారానే వచ్చారు. సింగరేణి ఏరియాలో కారుణ్య నియామకాలకు ఉండే డిమాండ్, ఈ ఉద్యోగాల పట్ల ఉన్న సెంటిమెంట్‌ను ఆసరా చేసుకుని ఒక్కో ఫైల్‌కు రూ.8 లక్షల వరకు కార్మికుల నుంచి దళారుల సిండికేట్ వసూలు చేస్తోంది అనేది బహిరంగ రహస్యం. గడిచిన ఆరేళ్ల వ్యవధిలో కోట్లాది రూపాయల కార్మికుల సొమ్మును దళారులు అప్పనంగా తమ ఖాతాలో వేసుకున్నారు.

కొత్త ప్రభుత్వమైనా దృష్టి పెట్టేనా..?

ఇటీవల రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. గత ప్రభుత్వ హయాంలో మంచి ఉద్దేశంతో ప్రారంభించిన పథకాలు ఆ తర్వాత లోపభూయిష్టంగా మారాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు మొదలు వ్యవసాయం, వైద్యం, విద్యుత్, కస్టమ్ రైస్ మిల్లింగ్, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలు.. ఇలా అనేక అంశాలపై కొత్త ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. క్షేత్రస్థాయికి వెళ్లి ఆరా తీస్తోంది. కొన్ని పథకాలు అమలవుతున్న తీరు భేషుగ్గా ఉండగా మరికొన్ని చోట్ల లోపాలు బయటపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అనేక అవినీతి ఆరోపణలకు కేంద్ర బిందువుగా మారిన కారుణ్య నియామకాల ప్రక్రియపై కూడా కొత్త సర్కార్ దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయి నుంచి పై స్థాయి వరకు అంచెలంచెలుగా పేరుకుపోయిన దళారీ వ్యవస్థను రూపుమాపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కారుణ్య నియామకాలపై వస్తున్న ఆరోపణలపై థర్డ్ పార్టీతో విచారణ చేయించి నిజానిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. అర్హత ఉన్న కార్మికులు.. ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వకుండా నియామకపత్రం అందుకునే పరిస్థితి నెలకొనేలా చూడాలని వేడుకుంటున్నారు.

వరప్రదాయినిగా కారుణ్య కొలువులు..

తెలంగాణలో ఒకప్పుడు ఉపాధి అంటే దుబాయి, బొంబాయి, బొగ్గుబాయి అన్నట్టుగా పరిస్థితి ఉండేది. సింగరేణిలో ఉద్యోగం అంటే తమ భవిష్యత్ భద్రమనే నమ్మకం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో నెలకొంది. దీంతో 80వ దశకం నుంచి ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడి ఉండే బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఎన్నో కుటుంబాలకు చెందిన పలువురు సింగరేణిలో కొలువుల కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తుండేవారు. ఇలాంటి వారికి కారుణ్య నియామకాలు వరప్రదాయనిగా మారాయి. అందువల్లే ఓసారి సింగరేణిలో కారుణ్య నియామకాలను రద్దు చేస్తే, కార్మిక లోకం అనేక పోరాటాలు చేసి పునరుద్ధరించుకుంది.

సహస్ర కలశాభిషేకానికి అంకురార్పణ



ఆలయానికి తీర్థబిందె తీసుకొస్తున్న అర్చకుడు



రామాలయంలో నూజివీడు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 24న జరుగనున్న సహస్రకలశాభిషేకానికి గురువారం అంకురార్పణ చేశారు. మేళతాళాల నడుమ అర్చకులు పవిత్ర గోదావరి నుంచి తీర్థ బిందె తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కాగా నేడు అగ్నిప్రతిష్ఠ, రేపు(శనివారం) బేడా మండపం వద్ద సహస్ర కలశాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించనున్నట్లు అర్చకులు వివరించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని శుక్ర, శనివారాల్లో స్వామివారి నిత్యకల్యాణాలు రద్దు చేసినట్లు తెలిపారు.

రమణీయం.. రామయ్య నిత్య కల్యాణం

శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ వద్ద స్వామివారికి పట్టాభిషేక మహోత్సవం జరిపించారు.

ఆన్‌లైన్‌లో టీటీడీ వసతి గదులు..

కాగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సీఆర్‌ఓ కార్యాలయం వద్ద నిర్మించిన 32 వసతి గదులను గురువారం నుంచి ఆన్‌లైన్‌లో ఉంచినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. ఒక్కో ఏసీ గదికి రూ.1300 (జీఎస్టీ అదనం) ఉంటుందని, భక్తులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం..

దేవస్థానం పరిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీలోని నెల్లూరు జిల్లా ఉస్మాన్ సాహెబ్‌పేటకు చెందిన పమిడిగంటం వెంకటరమణమూర్తి, మధుస్మిత దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు రశీదు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న నూజివీడు ఎమ్మెల్యే..

శ్రీ సీతారామచంద్రస్వామి వారిని నూజివీడు ఎమ్మెల్యే ఎం.వి ప్రతాప్ అప్పారావు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మూలమూర్తులను దర్శించుకోగా పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా ఎమ్మెల్యేను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు రామిరెడ్డి, కొల్లు వెంకటరెడ్డి, కడియం రామాచారి, ప్రబోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

పీఏసీఎస్‌లో డీసీఓ పరిశీలన



డీసీఓను సన్మానిస్తున్న చైర్మన్ తదితరులు

బూర్గంపాడు: బూర్గంపాడు పీఏసీఎస్‌ను జిల్లా సహకార శాఖ అధికారి సయ్యద్ ఖుర్షీద్ గురువారం పరిశీలించారు. ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన ఆయన పీఏసీఎస్‌ను పరిశీలించి సంఘ నిర్వహణ తీరుతో పాటు పంటరుణాల రికవరీ, ఎరువుల విక్రయాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, డీసీఓను పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, సీఈఓ ప్రసాద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహకార శాఖ అధికారులు కిషోర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించాలి

కలెక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

నవభారత్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని, నిర్దేశించిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. 2023 – 24 ఆర్థిక సంవత్సర రుణ లక్ష్యాల పురోగతిపై ఐడీఓసీలో గురువారం ఆమె బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణ లక్ష్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం రూ.5,599.03 కోట్ల రుణ లక్ష్యం కాగా, ఇప్పటివకు రూ.4,175.83 కోట్లు మంజూరు చేశామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. అందులో వ్యవసాయానికి రూ.4,309.54 కోట్లకు గాను రూ.1,923.91 కోట్లు, చిన్నతరహా పరిశ్రమలకు రూ.426.55 కోట్లకు రూ. 377.32 కోట్లు, విద్యారంగానికి రూ. 202.80 కోట్లకు రూ.7.45 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.536.22 కోట్లకు రూ.12.26 కోట్లు మంజూరు చేశామని వివరించారు. సమావేశంలో డీఆర్డీఓ విద్యాచందన, ఎల్డీఎం రామిరెడ్డి, నాబార్డు డీజీఎం సుజిత్, పరిశ్రమల శాఖ అధికారి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సంపూర్ణ సహకారం

వ్యవసాయ మంత్రి తుమ్మల



టమాట, మిర్చి రకాలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు

సుజాతనగర్: వ్యవసాయ రంగంలో వినూత్న విధానాలు అవలంబించే రైతులకు ఆ శాఖ మంత్రిగా తన వంతు సహకారం అందిస్తానని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సుజాతనగర్‌లో మన్నేపల్లి రవికి చెందిన టమాటా, మిర్చి పంటల పరిశోధనాత్మక క్షేత్రాలను మంత్రి గురువారం పరిశీలించారు. వందలాది రకాల మిర్చి, టమాల విత్తనాలను రూపొందిస్తున్న రైతును అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రాంతాలు, పంటలకు అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం అవసరమని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను రైతులు తట్టుకోవాలంటే పంటలకు అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు అవసరమని చెప్పారు. కాగా, కొత్తగూడెం పీఏసీఎస్ భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరగా, ఈ మేరకు అధికారులను ఆదేశించారు. అనంతరం రైతు రవి మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే ముగ్గురు రైతులను ఎంపిక చేసి ఏటా రూ.3 లక్షలు, రూ.2 లక్షలు, రూ.లక్ష చొప్పున నగదు పురస్కారాలు అందిస్తామని మంత్రి సమక్షాన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, నాగా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

డీడీఎన్ అర్చకులకు వేతనాలు జమ

రెండు జిల్లాల్లో 102 మందికి ఐదు నెలల వేతనాలు



దేవాదాయ శాఖ ఏసీ సులోచనకు కృతజ్ఞతలు చెబుతున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాలయాల్లో నూతనంగా నియమితులైన ధూప, దీప నివేదన పథకం అర్చకులకు ప్రభుత్వం వేతనాలు విడుదల చేసింది. ఆలయ నిర్వహణ పడితరం, అర్చకులకు నిర్దేశించిన ఐదు నెలల గౌరవ వేతనాన్ని బ్యాంకు ఖాతాల్లో గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ జమ చేసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 102 మంది అర్చకులకు ఆగస్టుకు సంబంధించి రూ.6వేల చొప్పున, సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు రూ.10 వేల చొప్పున జమ చేయడంతో అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూన్‌లో ఎంపిక.. ఆగస్టు నుంచి వేతనాలు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత ఏడాది జూన్‌లో అప్పటి ప్రభుత్వం నూతనంగా ఎంపికైన ధూప, దీప నివేదన పథకం అర్చకులకు పత్రాలు అందజేసింది. కానీ ఆగస్టు నెల నుంచి వేతనాలు మంజూరు చేయగా.. ఒకేసారి ఐదు నెలల వేతనాలు జమ చేసింది. అర్చకులకు ఆగస్టులో రూ.4 వేలు గౌరవ వేతనం, రూ.2 వేలు పడితరం కింద మొత్తం రూ.6 వేలు ఖాతాలో జమ చేశారు. ఇక సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు రూ.6 వేల గౌరవ వేతనం, రూ. 4 వేలు పడితరం కలిపి రూ.10 వేల చొప్పున అందాయి. ఖమ్మం జిల్లాలో 67 మందికి, భద్రాద్రి జిల్లాలో 35 మంది అర్చకులకు పడితరం, గౌరవ వేతనం జమయ్యాయి. అయితే, ఖమ్మం జిల్లాలో మరో 41 మందిని కూడా జనవరిలో నియమించగా, వీరికి వేతనాలు విడుదల కావాల్సి ఉంది. కాగా, అర్చకులకు ఒకేసారి ఐదు నెలల వేతనం విడుదల చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఖమ్మం పెవిలియన్ మైదానంలో అర్చకులు సమావేశమై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధూప దీప నివేదన అర్చక సంఘం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మునగలేటి రమేష్‌శర్మ, మరింగంటి భార్గవాచార్యులు, కె.ఆంజనేయశర్మ, పి.కిరణ్‌కుమార్‌శర్మతో పాటు అన్నావజ్జల ప్రసాద్‌శర్మ, శ్రీధర్‌శర్మ, నందుల ఉదయ్‌శర్మ, మాధవాచారి తదితరులు పాల్గొన్నారు.

25న సీఓఈ రెండో దశ ప్రవేశపరీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) ఇంటర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 25న రెండో దశ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆర్సీఓ కె.ప్రత్యూష తెలిపారు. కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఇప్పటికే ఓ విడత పరీక్ష నిర్వహించగా, ఇందులో మెరిట్ సాధించిన విద్యార్థులకు రెండో దశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. రీజియన్‌లో ఐదు కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఆదివారం ఉదయం 10నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు విద్యార్థులను 10 : 15 గంటల వరకే అనుమతిస్తామని స్పష్టం చేశారు.

కాషాయ ‘సంకల్పం’

- ఈనెల 25 నుంచి 27వరకు ఉమ్మడి జిల్లాలో బీజేపీ యాత్ర
- భద్రాచలంలో ప్రారంభించనున్న ఛత్తీస్‌గఢ్ సీఎం
- రెండు లోక్‌సభ స్థానాల పరిధి నియోజకవర్గాల్లో సభలు, రోడ్‌షోలు
- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన కమలదళం కసరత్తు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రతో ముందుకొస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఈనెల 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు యాత్ర చేపట్టనుంది. భద్రాచలంలో ప్రారంభమయ్యే యాత్ర ఉమ్మడి జిల్లా పరిధిలోని ఇల్లెందులో ముగిసి మహబూబాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తుంది. తొలిరోజు యాత్రను భద్రాచలంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాహు ప్రారంభించనుండగా, పది నియోజకవర్గాల్లో సభలు, రోడ్‌షోలు ఏర్పాటు చేయనున్నట్లు యాత్ర సమన్వయకర్త కొండపల్లి శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. అలాగే, సభల్లో కేంద్రమంత్రులు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొంటారని తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో నిరాశ

తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీజేపీని నిరాశ పరిచాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు స్థానాల్లో ప్రభావం చూపుతామని నేతలు భావించగా.. కొన్నేళ్లుగా ముఖ్య నాయకులు సైతం దృష్టి సారించారు. కేంద్ర మంత్రుల పర్యటనలతో కేడర్‌లో జోష్ నింపే ప్రయత్నం చేయడంతో పాటు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఖమ్మంలో అమిత్‌షా బహిరంగ సభ నిర్వహించారు. ఒక దశలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుందనే నమ్మకాన్ని కల్పించినా, అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఓట్ల పరంగా పుంజుకోలేదు. ఈ నేపథ్యాన పార్లమెంట్ ఎన్నికల్లో పట్టు కోసం ఇప్పటి నుంచే కసరత్తు మొదలుపెట్టారు.

మోదీ చరిష్మాతో..

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు మధ్య వ్యత్యాసం ఉంటుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక సమస్యలు, నాయకత్వం ప్రభావం చూపిస్తుండగా, పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ప్రధాని మోదీ చరిష్మా పనిచేసి తమకు పూర్తిస్థాయి అనుకూల పవనాలు వీస్తాయనే అంచనాలో ఉన్నారు. ఈ నేపథ్యాన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో సత్తా చాటేలా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే యాత్రకు రూపకల్పన చేశారు.

బరిలో నిలవాలని..

ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ చేసేందుకు బీజేపీలోని పలువురు నేతలు ఆసక్తిగా ఉన్నారు. ఖమ్మం టికెట్ కోసం కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, దేవకి వాసుదేవరావు, గల్లా సత్యనారాయణ, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, ఈవీ.రమేష్, తాండ్ర వినోద్‌రావు, మహబూబాబాద్ నుంచి హుస్సేన్‌నాయక్, యాప సీతయ్యతోపాటు పలువురు నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వీరంతా ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతూనే అవకాశం కోసం ఢిల్లీ, హైదరాబాద్‌కు క్యూ కడుతున్నారు. కేంద్రంలోని పెద్దలను సంప్రదించి టికెట్ ఖాయం చేసుకునేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు కొందరు నేతలు ఇప్పటి నుంచే ప్రచారాన్ని ప్రారంభించడం విశేషం.

బ్రహ్మాస్త్రంతో సిద్ధం

బీజేపీ అంటే రథయాత్ర గుర్తుకురావడం సహజం. ఆ రథయాత్రనే మరోసారి బీజేపీ తెరపైకి తీసుకొచ్చింది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పలు పార్లమెంట్ నియోజకవర్గాల్లో విజయసంకల్ప రథయాత్ర మొదలుకాగా, ఈనెల 25న భద్రాచలంలో యాత్రను ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాహు ప్రారంభించనున్నారు. రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడు రోజుల పాటు రథయాత్ర కొనసాగుతుంది. ‘ఫిర్ ఏక్‌బార్ మోదీ సర్కార్’ నినాదంతో ఆ పార్టీ విజయ సంకల్ప యాత్ర చేపడుతుండగా, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రజలకు కల్పించిన సౌకర్యాలను వివరించనున్నారు. అలాగే ప్రత్యేకంగా ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధిపై ప్రజలకు తెలియజేయాలని పార్టీ నిర్ణయించింది.

భద్రాచలం టూ భద్రకాళి..

ఈనెల 25న భద్రాచలంలో మొదలుకానున్న విజయసంకల్ప యాత్ర మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాల మీదుగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి చేరుకోవడంతో పూర్తవుతుంది. భద్రాచలం నుంచి వరంగల్‌లోని భద్రకాళి ఆలయం వరకు యాత్ర కొనసాగేలా షెడ్యూల్ రూపొందించారు. భద్రాచలంలో 25న మొదలు కానున్న యాత్ర మణుగూరుకు చేరుకున్నాక బహిరంగ సభ అనంతరం కొత్తగూడెం చేరుతుంది. ఇక 26న పాల్వంచ, దమ్మపేట మీదుగా అశ్వారావుపేట నియోజకవర్గంలోని మండలపల్లి చేరుకుని బహిరంగ సభ నిర్వహిస్తారు. ఆ తర్వాత సత్తుపల్లిలోనూ బహిరంగ సభ నిర్వహించి కల్లూరు, వైరాలో రోడ్‌షోలు పూర్తి చేసుకుని అదే రోజు మధిరకు చేరుకుంటుంది. మూడో రోజైన 27వ తేదీన బోనకల్, ప్రకాష్‌నగర్, కూసుమంచి మీదుగా రోడ్‌షో ఖమ్మం చేరుకుంటుంది. ఖమ్మంలో బహిరంగ సభ అనంతరం కారేపల్లి మీదుగా ఇల్లెందుకు వెళ్లి సభ నిర్వహిస్తారు. ఆ తర్వాత మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోకి వెళ్లడంతో ఉమ్మడి జిల్లాలో యాత్ర ముగుస్తుంది.

క్లుప్తంగా

పూర్వవిద్యార్థి చేయూతతో కళావేదిక



కళావేదికను ప్రారంభించిన కోట్యానాయక్, ఉపాధ్యాయులు

దమ్మపేట: దమ్మపేట గిరిజన గురుకుల పాఠశాల పూర్వవిద్యార్థి, కూసుమంచి మండలానికి చెందిన బానోత్ కోట్యానాయక్ సహకారంతో పాఠశాలలో నిర్మించిన కళావేదికను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట్యానాయక్ మాట్లాడుతూ.. దమ్మపేట గురుకులంలో 1995లో పదో తరగతి పూర్తి చేసిన తాను ఉన్నత విద్య అనంతరం అమెరికాలో సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించానని తెలిపారు. ఈ మేరకు ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేపడుతుండగా, తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలలో కళావేదిక నిర్మించానని పేర్కొన్నారు. అనంతరం కోట్యానాయక్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జానునాయక్, ఉపాధ్యాయులు శ్యాంకుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతరలో కాటన్ సంచుల పంపిణీ



కాటన్ బ్యాగులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

సింగరేణి(కొత్తగూడెం): గరీబ్‌పేట మినీ మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో గురువారం కాటన్ బ్యాగులను భక్తులను పంపిణీ చేశారు. పర్యావరణ సంస్థ నిర్వాహకుడు హరి ఇప్పనపల్లి, డాక్టర్ సీహెచ్ భద్రం మాట్లాడుతూ జాతర జరిగే ప్రాంతాల్లో కాటన్ సంచులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మేడారంలో లక్ష కాటన్ బ్యాగులను మంత్రులు కిషన్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్కల చేతుల మీదుగా పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొక్కల రాజశేఖర్, ఎస్‌కే ఖయ్యూం, సామర్ల సమ్మయ్య, ధర్మారావు, సైదాబాబు, భూపేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డిజిటల్ మేళా



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు


భద్రాచలంటౌన్: భద్రాచలం గిరిజన గురుకులంలో ప్రథమ్ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన డిజిటల్ మేళా పులువురిని ఆకట్టుకుంది. భద్రాచలం, బూర్గంపాడు మండలాలకు చెందిన 20 పాఠశాలల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొని విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ ప్రారంభించి మాట్లాడారు. నేటి ప్రపంచంలో బాల్యం నుంచే విద్యార్థులకు కంప్యూటర్‌పై పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు, రాజా శ్రీనివాస్, నరేందర్, రాజు, సాయి, లక్ష్మి, రాజు, అశ్విని, మమత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రుణ బాధితుల్లో ఆందోళన

ఇల్లెందురూరల్: రుణం పేరిట మోసానికి పాల్పడిన వ్యవహారంపై బాధిత మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు రుణం మంజూరు చేస్తామని నమ్మబలికి మోసం చేసేందుకు కుట్ర చేశారని బాధిత మహిళలు అఫ్రీన్, సల్మా, నాజియా, సంధ్య, సౌజన్య వాపోయారు. ఖమ్మానికి చెందిన వ్యక్తులు చేసిన కుట్రపై 'రుణం పేరిట మోసం' శీర్షికన గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈవ్యవహారంపై మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన బాధిత మహిళలు స్పందిస్తూ.. తాము రుణం కోసం మాత్రమే ఓ ప్రైవేటు బ్యాంకులో ఖాతా తెరిచామని, పెద్దమొత్తంలో నగదు లావాదేవీల కోసం మరో ప్రైవేటు బ్యాంకులో తమ పేరిట ఖాతా ఎలా తెరిచారో తమకు తెలియదని పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై తాము ఇల్లెందు పోలీసులను ఆశ్రయించామని, వారి సూచన మేరకు శుక్రవారం ఖమ్మంలో ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. మహిళల వద్దకు విచారణకు వచ్చిన ప్రైవేటు బ్యాంకు అధికారులు సైతం ఈ వ్యవహారంపై ఖమ్మంలో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం : మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామశివారులో అక్రమంగా తరలిస్తున్న నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐలు కేశవరావు, గణేష్‌లు గురువారం తెలిపారు. పోలీసులు తనిఖీలు చేస్తున్న క్రమంలో సుజ్ఞానపురం గ్రామానికి చెందిన భూక్యా బాబూరావు బైక్‌పై 50 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. నాటుసారా, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.12,595

నాలుగు నెలలుగా ఎదురుచూపులు

- పంచాయతీ కార్మికులకు వేతన చెల్లింపుల్లో జాప్యం
- నిధుల లేమి, ప్రత్యేకాధికారులకు చెక్‌పవర్ లేక ఇక్కట్లు
- ఉమ్మడి జిల్లాలో 3,932 మంది కార్మికులు



విధుల్లో నిమగ్నమైన గ్రామపంచాయతీ కార్మికులు

చుంచుపల్లి: కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధులు సకాలంలో అందక గ్రామపంచాయతీల్లో పరిపాలన ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం నిధుల కొరతతో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొంది. నాలుగు నెలల నుంచి వేతనాలు రాక పారిశుద్ధ్య కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 16 నెలలుగా అందకపోగా, అప్పుడప్పుడూ మంజూరయ్యే కేంద్ర ఆర్థిక నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

ప్రత్యేకాధికారులకు చెక్‌పవర్ రాక..

కార్మికులకు ప్రతినెలా 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాల్సిన ప్రభుత్వం నాలుగు నెలలుగా పట్టించుకోవడంలేదు. వచ్చే అరకొర జీతం కూడా సక్రమంగా ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పూట గడుపు కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గత నెల 2వ తేదీ నుంచి పల్లెపాలన ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్లినా, వారికి ఇంకా చెక్‌పవర్ ఇవ్వలేదు. దీంతో కొన్ని గ్రామపంచాయతీల్లో ఉన్న అరకొర నిధులను సైతం వినియోగించే పరిస్థితి లేదు. తక్షణ అవసరాలకు పంచాయతీ కార్యదర్శుల జేబులో నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 3,932 మంది కార్మికులు

ఉమ్మడి జిల్లాలో 1,070 గ్రామపంచాయతీలు ఉండగా, 3,932 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని 589 గ్రామపంచాయతీల పరిధిలో 2,280 మంది, భద్రాద్రి జిల్లా పరిధిలో 1,652 మంది కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం వీరిని మల్టీపర్పస్ వర్కర్లుగా పిలుస్తూ అవసరాలకు అనుగుణంగా అన్ని పనులకు వినియోగిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, ట్రాక్టర్‌డ్రైవర్, కారోబార్ వంటి వారు ఉండగా, ఒక్కో కార్మికుడికి నెలకు రూ.9,500, కొన్ని మేజర్ జీపీల్లో రూ.10,500 చొప్పున వేతనం చెల్లిస్తున్నారు. పెద్ద పంచాయతీల్లో 8 నుంచి 12 మంది వరకు, చిన్న పంచాయతీల్లో నలుగురు నుంచి ఐదుగురు వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ఇంకొన్ని మేజర్ పంచాయతీల్లో అవసరాలకు అనుగుణంగా తాత్కాలిక సిబ్బందిని కూడా వినియోగిసున్నారు. గతేడాది ఉమ్మడి జిల్లాలోని పలు పంచాయతీలు రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు సాధించడంలో కార్మికుల కృషి కూడా ఉంది. కాగా, భద్రాద్రి జిల్లాలో కార్మికులకు మూడు, నాలుగు నెలలుగా, ఖమ్మం జిల్లాలో ఐదారు మాసాలుగా వేతనాలు ఇవ్వడంలేదు.

ఆర్థిక ఇబ్బందులు..



నెలలుగా వేతనాలు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. మేమందరం నెలవారీగా వచ్చే కొద్ది జీతంపైనే ఆధారపడి బతుకుతుంటాం. అలాంటిది మూడు, నాలుగు నెలలుగా వేతనాలు లేక అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు విడుదల చేయాలి.

– ఎం.డీ.యూసుఫ్, పంచాయతీ కార్మికుడు

నిర్లక్ష్యం వీడాలి



తక్కువ వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్న పంచాయతీ కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా కార్మికులపై ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యధోరణి వీడి సక్రమంగా వేతనాలు చెల్లించాలి.

– నరాటి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు



ప్రైవేట్ వైద్యులు ప్రభుత్వాస్పత్రిలో సేవలందించాలి

ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



ప్రైవేట్ వైద్యులు, వైద్యాధికారులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్న నేపథ్యంలో పట్టణంలోని ప్రైవేట్ వైద్యులు, రేడియాలజిస్టులు రోస్టర్ విధానంలో వైద్య సేవలను అందించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం భద్రాచలానికి చెందిన స్త్రీ వైద్య నిపుణులు, రేడియాలజిస్టులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సిజేరియన్లు తగ్గించి, నార్మల్ డెలివరీలు పెంచాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయొద్దని హెచ్చరించారు. గర్భిణులకు ఏదైనా సమస్య వల్ల అబార్షన్ చేయాల్సి వస్తే తమ అనుమతి తీసుకోవాలని చెప్పారు. వైద్య నిపుణులు, రేడియాలజిస్టులు రోజుకొకరు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఉచితంగా ప్రభుత్వాస్పత్రిలో సేవలు అందించాలన్నారు. ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపాలని, పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో మందులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ శిరీష, ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ చైతన్య, వైద్యులు, రేడియాలజిస్టులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

గిరిజన విద్యార్థులు క్రీడా పోటీల్లో రాణించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. గిరిజన పాఠశాలల్లో చదువుతూ జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించారు. కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌కు చెందిన జి.హర్ష కుమార్ ఆర్చరీలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడని ప్రశంసించారు. ఇతర విద్యార్థులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్ హెచ్‌ఎం చందు, క్రీడల అధికారి బి.గోపాలరావు ఏఎస్‌ఓ వెంకట్రావు, కోచ్‌లు రాంబాబు, నాగరాజు, వీరన్న, వాసు తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్



మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు

అన్నపురెడ్డిపల్లి : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న జిల్లా విద్యాశాఖ, తొలి అడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు తెలిపారు. గురువారం ఆయన ఎర్రగుంట జెడ్పీ పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. ఈ సంవత్సరం ఆరోగ్యం, లైఫ్‌స్టైల్–ఎన్విరాన్‌మెంట్, వ్యవసాయం అనే మూడు అంశాలపై ఒకరోజు సైన్స్‌ఫేర్ ఉంటుందని చెప్పారు. విద్యార్థులు ఈ మూడు అంశాలపై రూపొందించిన ఎగ్జిబిట్లు మాత్రమే పోటీల్లో ప్రదర్శించాలని సూచించారు. పోటీలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు, ఒక ఉపాధ్యాయుడు పాల్గొనే అవకాశం ఉందన్నారు. సైన్స్‌ఫేర్‌లో పాల్గొనే వారు ఈ నెల 22 నుంచి 27 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పోటీలకు వచ్చే విద్యార్థులు పాఠశాల రౌండ్ స్టాంప్ తీసుకుని రావాలని, వివరాలకు 9247296012 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు వెళ్తొస్తూ.. అనంత లోకాలకు

- లారీ, బైక్ ఢీ
- ఒకరు అక్కడికక్కడే మృతి
- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మరొకరు మృత్యువాత



భద్రం (ఫైల్)



సాయిరాం (ఫైల్)



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టేకులపల్లి: సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్లొస్తుండగా బైక్‌ను లారీ ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్‌ఐ షేక్ సైదా రవూఫ్ కథనం ప్రకారం.. మండలంలోని ప్రెగళ్లపాడు గ్రామానికి చెందిన మోకాళ్ల భద్రం(35), వాసం సాయిరాం(21) బావా బావమరుదులు. గురువారం ఇద్దరూ బైక్‌పై ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం వెళ్లి సమ్మక్క– సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో రోళ్లపాడు క్రాస్ రోడ్డు సమీపంలో ఇల్లెందు వైపు నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మోకాళ్ల భద్రం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిరాం తీవ్ర గాయాలపాలై స్పృహ కోల్పోయాడు. క్షతగాత్రుడిని ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమద్ధీకరించారు. ప్రమాదానికి సంబంధించి పంచనామా నిర్వహించారు. భద్రం డ్రైవర్‌గా, సాయిరాం క్లీనర్‌గా పని చేస్తుండగా, ఇద్దరూ అవివాహితులే. మృతుడు భద్రంకు తల్లిదండ్రులు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. మృతుడు సాయిరాంకు తల్లిదండ్రులు, సోదరి ఉన్నారు. ఇద్దరివీ నిరుపేద కుటుంబాలే. ఇద్దరి మృతితో ప్రెగళ్లపాడు గ్రామంలో విషాదం అలుముకుంది.

రిజర్వాయర్ శిఖం భూమిలో ఆక్రమణలు

వైరా: వైరాలోని రిజర్వాయర్ శిఖం భూమిలో యథేచ్ఛగా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. పట్టణంలోని 2, 3వ వార్డు పరిధిలో ఉన్న శిఖం భూముల్లో రెండు రోజులుగా ఆ ప్రాంత వాసులు గుడిసెలు వేసి ఆక్రమణకు యత్నిస్తున్నారు. ఈమేరకు ఆ ప్రాంతాన్ని సందర్శించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేయొద్దని సూచిస్తూ తక్షణమే తొలగించాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రూ.75 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం లెనిన్‌నగర్‌కు చెందిన మడిపల్లి స్టాలిన్ రూ.75లక్షలకు గాను గురువారం దివాళా పిటీషన్(ఐపీ) దాఖలు చేశాడు. ఆయన ఖమ్మంలో ఎస్‌ఎస్ ల్యాబ్ పేరుతో రక్త పరీక్షల కేంద్రాన్ని నిర్వహించగా.. పలువురి వద్ద అప్పులు చేశాడు. వీటిని తీర్చలేని పరిస్థితి ఎదురైందని పేర్కొంటూ.. 18మందిని ప్రతివా దులుగా చేరుస్తూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాది ద్వారా దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కూసుమంచి: మండలంలోని పాలేరులో గురువాయిగూడెం క్రాస్ వద్ద ఈనెల 14న జరిగిన రోడ్డుప్రమాదంలో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కిష్టాపురానికి అల్లం ఉపేందర్ తన భార్య కవితతో ద్విచక్రవాహనంపై పాలేరు నుంచి రాత్రి 7 గంటల సమయాన ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో చౌటపల్లి శివారు నానుతండాకు చెందిన భూక్యా భిక్షం ఆటో వేగంగా నడుపుతూ వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టగా కవిత తీవ్రంగా గాయపడింది. ఈ మేరకు ఘటనపై ఉపేందర్ ఫిర్యాదు చేయగా, ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కేసులు

ఖమ్మంక్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 594 మందిపై సిటీ పోలీస్‌యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఓ ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ పక్కాగా అమలవుతోందని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, వేగంగా వాహనాలు నడపడం, రాత్రివేళ సమయానికి మించి షాపులు తెరవడం, రహదారులకు అడ్డంగా వేడుకలు నిర్వహించే వారిపై ఈ యాక్ట్ అమలు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. వీరికి జరిమానా, జైలు శిక్ష కూడా పడే అవకాశాలు ఉందని చెప్పారు. పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వర్తిస్తున్నందున ఇతరులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తున్న వారు తీరు మార్చుకోవాలని సీపీ సూచించారు.

పల్లె దవాఖానాలో ఎన్‌క్వాస్ బృందం తనిఖీ

పెనుబల్లి: మండలంలోని లంకపల్లి పల్లె దవాఖానాను జాతీయ నాణ్యత ప్రమాణాల తనిఖీ(ఎన్‌క్వాస్) బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులైన డాక్టర్ ప్రహ్లాద్ గుంజాల్, డాక్టర్ రాజేష్ రాక్స్ తదితరులు దవాఖానా ద్వారా అందుతున్న సేవలు, చికిత్స, వ్యాక్సినేషన్, మందుల లభ్యత వివరాలను తెలుసుకున్నారు. అలాగే, చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడి సేవలపై ఆరా తీశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సీతారాం, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సౌమ్య, ఉద్యోగులు అలేఖ్య, ఉపేందర్, ఇస్లావత్ రెడ్డి, కళావతి, శ్రీనివాస్, ప్రకాశ్‌రావు, నాగేశ్వరరావు, పొట్టెమ్మ, నిర్మలకుమారి, కిరణ్, శ్రీనివాస్, కృష్ణవేణి, రవికుమార్, త్రివేణి, నాగమణి, రాణి, సౌజన్య, పుల్లమ్మ, త్రివేణి, ప్రతిభ, శిరీష పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యాయత్నం

రెండు గంటలపాటు ఈత కొట్టిన మహిళ

వైరా: ఖమ్మంజిల్లా వైరాకు చెందిన ఆ వివాహిత(28) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈమేరకు గురువారం ఉదయం వైరా రిజర్వాయర్ వద్దకు వచ్చి దూకింది. అయితే, దూకాక ఏమనుకుందో ఏమో కానీ ఈత వచ్చిన ఆమె ఒడ్డుకు వచ్చేందుకు యత్నించింది. కానీ ఎటు చూసినా సుమారు అర కిలోమీటర్ మేర నీరు ఉండడంతో ఒడ్డుకు చేరలేక అక్కడక్కడే ఈత కొడుతూ సుమారు రెండు గంటల పాటు ఉండిపోయింది. చివరకు రిజర్వాయర్ ఆనకట్టపై వెళ్తున్న ఓ వ్యక్తికి 'హెల్ప్, హెల్ప్' అని లీలగా వినపడడం, చేతులు ఊపుతున్న మహిళ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఈమేరకు ఎస్‌ఐ భాగ్యరాజ్ సిబ్బందితో చేరుకుని కొందరు యువకుల సాయంతో ఆ వివాహితను బయటకు తీసుకొచ్చారు. అప్పటికే కడుపులోకి బాగా నీళ్లు చేరడానికి తోడు అలసటతో అస్వస్థతకు గురైన ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చి అప్పగించగా, ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ తెలిపారు.

రుణం పేరిట బెదిరించి రూ.23,500 స్వాహా

కూసుమంచి: ఓ వ్యక్తికి వాట్సాప్ కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు రుణం చెల్లించకపోతే మార్ఫింగ్ చేసిన అసభ్య చిత్రాలు అందరికీ పంపిస్తామంటూ నగదు స్వాహా చేశారు. కూసుమంచి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి కందుల ఉపేందర్‌కు ఈనెల 13న వాట్సాప్ కాల్ వచ్చింది. ఎదుటి వ్యక్తులు రుణం ఉన్నందున చెల్లించాలని సూచించగా, తనకెలాంటి రుణం లేదని చెబుతున్నా వినలేదు. ఆపై ఉపేందర్ ముఖంతో మార్ఫింగ్ చేసిన అసభ్య దృశ్యాలను ఆయనకు పంపించడంతో భయపడి వారు పంపించిన లింక్ ఓపెన్ చేయగా, ఖాతా నుంచి రూ.23,500 నగదు డెబిట్ అయింది. అయినప్పటికీ ఆగక మరో రూ.50వేలు పంపాలని చెప్పడంతో ఉపేందర్ సైబర్ క్రైమ్ నంబర్‌కు 1930 ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ప్రజలంతా సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సమస్య ఎదురైతే 1930కి సమాచారం అందించాలని సూచించారు.

'పశువైద్యులపై బురద జల్లే ప్రయత్నం'

ఖమ్మంవ్యవసాయం: గొర్రెల పథకం అమలులో భాగంగా రవాణా వ్యవహారంపై బయటపడిన లోపాల నేపథ్యాన పశువైద్యాధికారులపై బురద జల్లే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల సర్వీస్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు పేర్కొన్నారు. ఈమేరకు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎం.ఉపేందర్, డాక్టర్ పి.అశోక్ ఒక ప్రకటన విడుదల చేశారు. గొర్రెల రవాణా, నగదు చెల్లింపు అంశాలతో పశువైద్యాధికారులకు సంబంధం లేదని పేర్కొన్నారు. కాగ్ నివేదికలో లోపాలను బయటపెట్టినా ఇన్‌వాయిస్‌ల్లో దిద్దుబాట్లు, నకిలీ ఇన్ వాయిస్‌లతో తమకు సంబంధం లేకున్నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా నిరాధారమైన ఆరోపణలుచేయడం సరికాదన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు, ఎంపీడీఓల సమక్షాన జరగగా, వాటాధనాన్ని డీడీ ద్వారా చెల్లించారన్నారు. ఆతర్వాత ఏపీలోని పలు ప్రాంతాల్లో జీవాలను కొనుగోలు చేయగా తాము ఆరోగ్య పరీక్షలు నిర్వహించి బీమా వివరాలను యాప్‌లో నమోదు చేశామని తెలిపారు. అనంతరం రవాణా చేశాక వివరాలను సంయుక్త సంచాలకుల కార్యాలయానికి పంపిస్తే, ఉద్యోగులు పరిశీలించి నగదు చెల్లించారని పేర్కొన్నారు. ఈ మేరకు రవాణా అక్రమాల్లో తమకు సంబంధం లేదని గుర్తించాలని సూచించారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: దాడి ఘటనలో ముగ్గురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో పద్మకిరాణం దుకాణం వద్ద కేశవాపురం గ్రామానికి చెందిన బండి అమృత్ తన ద్విచక్రవాహనాన్ని నిలిపి సరుకులు కొనుగోలు చేస్తున్నాడు. అదే సయమంలో కొందరు వాహనాల్లో మేడారం జాతరకు వెళ్తున్నారు. ద్విచక్ర వాహనం అడ్డంగా ఉందంటూ బుధవార రాత్రి తిట్టి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గుగులోతు కుమార్, జాటోతు నరేష్, శ్రీరాంపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు తెలిపారు.

కేటరింగ్ యువకులపై దాడి

అశ్వారావుపేటరూరల్: దాడి ఘటనలో నలుగురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని కేశప్పగూడేనికి చెందిన బేతి పాపారావు ఇంట్లో జరిగిన శుభకార్యంలో అదే గ్రామానికి చెందిన బేతి కన్నారావు, బేతి నాగబాబు, బేతి మహేష్, సున్నం రాంబాబు అనే వ్యక్తులు విందులో తమకు కూర సరిగ్గా వేయలేదని కేటరింగ్ యువకులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో ఘర్షణ జరిగింది. కేటరింగ్ చేస్తున్న మండలంలోని రాజానగరానికి చెందిన కాక మహేష్, తానం దేవరాజు, ఎస్.విజయ్, సున్నం నాగేందర్, మడివి గణేష్, కణితి రాంబాబులపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్వర్టుపై రక్తపు మరకల కలకలం



రక్తపు మరకలు ఉన్న కల్వర్టు

వేంసూరు: మండలంలోని కుంచపర్తి శివారు నూతిపాడు రోడ్డులోని ఒక కల్వర్టుపై రక్తపు మరకలు ఉండడం కలకలం రేపింది. తెలంగాణ – ఏపీ సరిహద్దులోని కల్వర్టుపై రక్తపు మరకలను గురువారం ఉదయం గుర్తించిన కుంచపర్తి, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విసన్నపేట మండలం నూతిపాడు గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. కుంచపర్తిలో వైన్ షాపు ఉండగా, పలువురు ఈ ప్రాంతంలో మద్యం సేవిస్తుంటారు. అయితే, ఇక్కడ ఎవరైనా క్షుద్రపూజలు చేసి జంతు బలి ఇచ్చారా, లేక మద్యం తాగేవారితో ఇక్కట్లు ఎదురవుతుండడంతో స్థానికులే వారిని భయపెట్టేందుకు రక్తం మరకలు వేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది కరీం, వెంకటరత్నం చేరుకుని పరిశీలించారు. కల్వర్టుపై రక్తపు మరకలు ఉన్న చోట మద్యం సీసాలు, సారా ప్యాకెట్లను గుర్తించారు.

రెండు కార్లు ఢీ, ఐదుగురికి గాయాలు

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం సమీపాన గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మంకు చెందిన గొల్లపూడి నర్సింహారావు తన కుటుంబీకులతో కారులో కోదాడ నుంచి ఖమ్మం వస్తున్నారు. అదే సమయాన ఖమ్మానికి చెందిన గడ్డం కృష్ణ తన కారులో ఖమ్మం నుంచి కోదాడ వెళ్తుండగా, గువ్వలగూడెం రైస్ మిల్లు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. అయితే, ప్రమాద సమయాన కార్లలో బెలూన్లు తెరుచుకోగా.. సైదులు, నర్సింహారావు, కృష్ణతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులకు నేలకొండపల్లిలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, ఈ ఘటనతో ఖమ్మం–కోదాడ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.